
నేడు పట్టణంలో శాకాహార మహా ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో మహాకరుణ మెగా శాకాహార మహా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు తాటి సంతోష్ తెలిపారు. శనివారం ఆయన జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. 'శాకాహారులుగా మారుదాం-మూగ జీవులను రక్షిద్దాం' అనే నినాదంతో ఆదివారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి మహా ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూగ జీవుల సంరక్షణ కోసం ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.



● అధ్వానంగా మారి కనిపిస్తున్న నార్నూర్‌లోని రైతు వేదిక



● ఇంద్రవెల్లిలో తాళం వేసి ఉన్న రైతు వేదిక

రైతు వేదికలకు తాళం

- జిల్లాలో పలుచోట్ల నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్న భవనాలు
- పత్తాలేని అధికారులు.. అన్నదాతల ఎదురుచూపులు
- మున్నాళ్ల ముచ్చటగానే మారిన భవన నిర్మాణాల నాణ్యత
- పంటల సాగుపై కరువవుతున్న అవగాహన
- జిల్లావ్యాప్తంగా 101 క్లస్టర్ల పరిధిలో ఒక్కో దానికి రూ.22 లక్షల వ్యయంతో మొత్తం 101 రైతు వేదికల నిర్మాణం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని లక్షల రూపాయలతో రైతు వేదికలను నిర్మించినా.. తాళం వేసే కనిపిస్తున్నాయి. ఎంతో ఆగమేగాల మీద రైతు వేదికల నిర్మాణ పనులను పూర్తి చేసిన అధికారులు నిర్లక్ష్యంగానే వదిలేస్తున్నారు. క్లస్టర్ల వారీగా రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు ఖర్చు చేసినా.. ఫలితమే లేకుండా పోయిందంటున్నారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలో 101 క్లస్టర్ల పరిధిలో 101 రైతు వేదికలను నిర్మించారు. దాదాపుగా అన్నిచోట్ల పనులను పూర్తి చేసి ప్రారంభించారు. అలాగే గతంలో రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం కొన్ని నిధులను కూడా మంజూరు చేసింది. ఈ నిధులను పర్నిచర్ కొనుగోలు, నిర్వహణ, విద్యుత్ చార్జీలు, నీటిసౌకర్యం కోసం ఉపయోగించుకున్నారు. అయితే ఊరికి కిలో మీటర్ల దూరంలో ఉండడంతో నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కనీసం విద్యుత్‌సౌకర్యం కూడా లేకపోవడంతో తాళం వేసే ఉంచుతున్నారు. ప్రారంభంలో కొంతమంది అధికారులు క్రమం తప్పకుండా రైతువేదికల్లో సమావేశాలను ఏర్పాటు చేసినా.. ఆ తర్వాత తాళం వేసి వెళ్లిపోయారంటూ అన్నదాతలు పేర్కొంటున్నారు. ఏదో అడపాదడప గ్రామానికి వస్తున్నా.. రైతువేదికల వైపు కన్నెత్తైనా చూడడం లేదంటున్నారు. యాసంగి, వానాకాలం సీజన్లలో పండించే పంటల సాగుపై సలహాలు, సూచనలు కరువవుతున్నాయి. ఫోన్‌లో సంప్రదించినా అధికారులు అందుబాటులోకి రావడం లేదని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా రైతువేదికలను ఉపయోగంలోకి తీసుకువచ్చి అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మూసిన తలుపులు తెరవరు

నెలల తరబడి రైతువేదికల మూసిన తలుపులు తెరవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన రైతుభరోసా సర్వే సందర్భంగా అక్కడికి వచ్చి రైతువేదికలను తెరిచినా.. చాలాచోట్ల అపరిశుభ్రమైన పరిసరాలతో రైతు వేదికలు అధ్వాన్నంగా మారి కనిపిస్తున్నాయి. కనీసం నెలలో ఒకసారైనా రైతు వేదికలను తెరిచి ఉంచితే రైతులు సమావేశమై తమ సమస్యలపై చర్చించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏఈవోలు, ఏవోలు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్లిపోతారో? అర్థం కానీ పరిస్థితి ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రతీ గ్రామంలో ఏఈవోలు పనిచేస్తున్నా.. స్థానికంగా ఉండడం లేదంటున్నారు. రైతువేదికల నుంచే ఏఈవోలు విధులు నిర్వహించాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా అధికారులు అటువైపు వెళ్లినట్లే కనిపించడం లేదంటున్నారు. కనీస వసతులు కల్పించకుండా విధులు ఎలా నిర్వహిస్తామని? సమాధానం ఇస్తున్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఈవోలలో చాలా మంది మహిళా అధికారులే ఉన్నారు. ఊరికి దూరంగా నిర్మించిన రైతువేదికల్లో విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతువేదికల నుంచి విధులు నిర్వహించేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. రైతువేదికల పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారి కనిపిస్తున్నాయి. దీంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొన్ని గ్రామాల్లోనైతే పెళ్లిలు, శుభకార్యాలను నిర్వహించుకుంటున్నారు. అంతేకాకుండా పంట దిగుబడులను కూడా రైతు వేదికల్లోనే నిల్వ చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఇంకెన్నాళ్లు.. ఎదురుచూపులు?

రైతువేదికలను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చినా.. అధికారుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. రైతువేదికల నిర్వహణ బాధ్యతలను ఏఈవోలకు అప్పగించినా.. నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. నెలల తరబడి రైతువేదికలవైపు రాకపోవడంతో అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. పంటల సాగులో సలహాలు, సూచనలు కరువవడంతో రైతులే తమకున్న అనుభవంతో పంటలను సాగుచేస్తున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల సర్వే

(తరువాయి 6వ పేజీలో...)





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదివాసీ నాయకులు

హీరాసుక జయంతిని జయప్రదం చేయాలి : ఆదివాసీ పర్ధాన్ సమాజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఆదివారం నిర్వహించనున్న గోండి ధర్మ గురు హీరాసుక జయంతికి జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని హీరాసుక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్, గౌరవ అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ పిలుపునిచ్చారు. శనివారం సభ ఏర్పాట్లను కుల పెద్దలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమస్త ఆదివాసీ పర్ధాన్ సమాజం మేధావులు, ఉద్యోగులు, యువకులు, కార్మికులు, కర్షకులు, వివిధ సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి మన సమాజ అస్తిత్వ, ఐక్యత, సంస్కృతి సంప్రదాయాలను చాటాలన్నారు. సమాజంలోని సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే విధంగా తమవంతుగా మద్దతును తెలుపాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పూసం ఆనంద్‌రావు, ఆత్రం అనుసూయ, గేడం భారతి బాయి, సెడ్మకి సుభాష్, వెట్టి దేవిదాస్, గేడం మాధవ్, మడావి దిగంబర్, ఆర్క శేషరావ్, కుడ్మెత ప్రకాష్, విఠల్, గణేష్, వెట్టి మనోజ్, భూమన్న, దిలీప్, కినక సత్య పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ సంస్థలకు సెలవు

ఉట్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ జయంతి పురస్కరించుకొని సోమవారం 24వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు జారీ చేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావు కోరిక మేరకు ఈ సెలవు ప్రకటించడం జరిగిందని, తిరిగి ఏప్రిల్ రెండవ శనివారం ఉద్యోగులు విద్యా సంస్థలు పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

● జిల్లాకేంద్రంలో సేవాలాల్ జయంతి

ఉట్నూర్: జిల్లాకేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో సోమవారం ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కన్వీనర్ రాథోడ్ భీంరావు తెలిపారు. జిల్లాలోని సేవాలాల్ భక్తులు, అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేరడిగొండ: జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానం లో ఈనెల 24న జరిగే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు రూపావత్ బాబులల్ అన్నారు. మండలంలోని బుగ్గారం గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ తండాల నాయక్, కారోబారి డావ్, గేర్య, ప్రజాప్రతినిధులు, సమస్త బంజారాలు తరలి రావాలని కోరారు. ఇందులో నాయకులు సాయిరాం, అనిల్, గణేష్, తదితరులు ఉన్నారు.



సంకీర్తనలు పాడుతున్న భక్తులు

కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ

ఇచ్చోడ, ఫిబ్రవరి, 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్రా(బి) గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామా సప్తాహ కార్యక్రమం శనివారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. సప్తాహ కార్యక్రమంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొందని, చిన్నపెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ భజన సంకీర్తనలకు హాజరై భక్తి పారవశ్యంతో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

కౌట(బి)లో ఘనంగా పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

బోథ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట (బి) గ్రామంలో శనివారం పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా గ్రామంలోని మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు మంగళహారతులు చేతబట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోతరాజులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. రోడ్లపై పసుపు బండారిని చల్లుతూ ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా మేకలను బలి ఇవ్వడం జరిగింది.



వేడుకలలో పోతరాజుల విన్యాసం

బీజేపీ, బీఆర్ఎస్.. రెండూ ఒకటే

● రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ బీఆర్ఎస్ రెండూ ఒకటేనని ఆ రెండు పార్టీలు నాణేనుకున్న బొమ్మా బొరుసు లాంటివని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆదిలాబాద్ పర్యటనకు విచ్చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పాల్గొని మాట్లాడారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ కాడి వదిలేసిందని కాంగ్రెస్ పార్టీని ఓడించేదుకు బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుదని దుయ్యబట్టారు. కాని అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని, తమ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగింది జరుగుతుందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి బైట్కూరి నరేందర్ రెడ్డికే తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఎవరు చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలతోపాటు ఇవ్వని అనేక పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని చాటుకుంటోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్రం సుగుణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, కొండ గంగాధర్, బొల్లారం బాబన్న, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు సెడ్మాకి ఆనంద్ రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

● ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఆదిలాబాద్ రూరల్: పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు ఆఫీస్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులను నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి సన్మానించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. మాజీ కేంద్ర మంత్రి వేణు గోపాల చారి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మల్లేష్ పాల్గొన్నారు.

● జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి పర్చేందుకు కృషి

తలమడుగు: జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని పర్యాటకశాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సంవత్సరంలోపే ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. అదేవిధంగా ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల. ఉపాధ్యాయుల ఎన్నికల్లో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులలో బాపన్న, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి

రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే : కేంద్ర మాజీ మంత్రి

నేరడిగొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో 55వేల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి సత్తు మల్లేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూర్ నరేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీల పేరిట తెలంగాణ ప్రజల డబ్బు దోచుకుంటోందని ఆరోపించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి తమ తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేశారా? అని ప్రశ్నించారు. కుల, మతాల పేరిట రాజకీయం చేసే వారికి ఓటు వేయవద్దని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు తెల్లరేషన్ కార్డులు, కార్డులు ఉన్న వారికి ఆరోగ్య భద్రత ప్రభుత్వం నుంచి వచ్చేలా వారికి భరోసా కల్పిస్తామన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తే ఆ ప్రభావం వచ్చే సంస్థాగత ఎన్నికలలో సులువు అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, ఎన్నికల పరిశీలకులు గాజర్ల అశోక్, పీసీసీ కోఆర్డినేటర్ మార్క విజయ్, కుమార్, తదితరులు ఉన్నారు.

సంకల్పంతో పని చేయండి.. సహకారం ఉంటుంది

● బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేజాదవ్ అనిల్

బోథ్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మనం సంకల్పంతో పని చేస్తే దేవుని సహకారం ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం సోనాల మండల కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. వేర్వేరు రూపాల్లో ఉన్న దేవుడు ఒక్కడేనని, వివిధ రూపాలలో మనం దైవాన్ని కొలుస్తూ ప్రశాంత జీవితాన్ని గడపాలని పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్, నారాయణ మహరాజ్ చూపించిన మార్గంలో నడవాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బంజారా భవనాన్ని అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాజధానిలో నిర్మింప చేశారన్నారు. అంతేగాక గ్రామ గ్రామాన సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకునేందుకు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందన్నారు. సోనాల మండలం ఏర్పాటుతోపాటు చిన్నచిన్న గూడెం తాండాలు గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు టి. శ్రీనివాస్ ప్రీతం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ సర్పంచులు సి. సదానందం, శ్రీధర్ రెడ్డి, బిజెపి మండల కన్వీనర్ బోరే రవీందర్, మాజీ రైల్వే బోర్డు సభ్యులు జివి రమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.చంటి గాజుల పోతన్న, బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబూలాల్ బోథ్ పట్టణ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌తో పాటు స్థానిక ఎస్సై ప్రవీణ్ బంజారా సంఘం నాయకులు మాజీ సర్పంచ్ రామ్ కిషన్ యాదవ్, సోనాల మాజీ సర్పంచ్ నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఆటలు ఆడాలని సూచించారు. అనంతరం పొచ్చెర గ్రామ మాజీ సర్పంచ్ దివాకర్ రెడ్డి పల్లి మృతి చెందడంతో గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

● శివపార్వతుల కల్యాణానికి రండి

బోథ్: సోనాల మండల కేంద్రంలో ఈనెల 24న రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణానికి రావలసిందిగా సోనాల గ్రామ వీడీసీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఇందులో గ్రామస్థులు సుధీర్‌రెడ్డి, చిలుకూరి నరేందర్, అభిలాష్, అసిఫ్, భీమ్రావు పాటిల్, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



సోనాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు



క్షేత్రస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాలి : మార్కెటింగ్ డీపీఎం

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్క మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు క్షేత్రస్థాయిలో మహిళలతో కలిసి పని చేసే సిబ్బంది జీవనోపాధిఇ విషయాలపై అవగాహన కల్పించాలని మార్కెటింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శోభారాణి అన్నారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతీ మహిళకు ఋణాలను అందించాలని తెలిపారు. స్త్రీ నిధి ఋణాలను అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలని అన్నారు. సీసీలకు కేటాయించిన టార్గెట్‌లను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. రికార్డులను పూర్తిగా పరిశీలించి పలు సూచనలను సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గణేష్, సీసీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను కాపాడాలి

నేరడిగొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని ఎఫ్ఆర్‌వో గణేష్ అన్నారు. శనివారం మండలంలోని బుగ్గారాం(బి) గ్రామానికి వెళ్లే రహదారి ఇరువైపులా 400 మొక్కలను నాటారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటడం జరిగిందన్నారు. నాటిన మొక్కలను అటవీ శాఖ అధికారులే కాకుండా ప్రజలు సైతం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రాథోడ్ సవిత, ఎఫ్ఆర్‌వో భీంజీ, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : ఆడె

నేరడిగొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా సన్నాహక యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆడె గజేందర్, యూత్ కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి ఓరగంటి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులకు దిశ నిర్దేశం చేశారు. మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీఒక్క ఓటరును కలిసి ఓటు అభ్యర్థించాలని కచ్చితంగా గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మండల ఉపాధ్యక్షుడు, మండల కమిటీలు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవు : గోక

తలమడుగు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవని వారి మాటలను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్ట భద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉట్కూరి నరేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నందున గ్రాడ్యుయేట్ ఓటర్లందరూ మెజారిటీ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో పట్ట భద్రులను ఉద్దేశించి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాపన్న, మాజీ ఎంపీపీ కల్యాణ్ నెంబర్ లక్ష్మి, రాజేశ్వరి, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, పి.ప్రేమ్ సాగర్ రెడ్డి, కొత్తపల్లి ప్రణయ్, పి.సిద్ధార్థరెడ్డి, రంగిరి సాయి, ఎన్.రఘునందన్‌రెడ్డి, మగ్గిడి ప్రణేష్, నిమ్మల దశరథ్‌రెడ్డి, కుమ్మరి ఆశన్న, బండి వెంకన్న, నడిపెన్న, రావుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ర్యాలీని విజయవంతం చేయండి'

తలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పిఎస్ఎస్ఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా శాఖాహార ర్యాలీని విజయవంతం చేయాలని పీఎస్ఎస్ఎన్ జిల్లా అధ్యక్షుడు తాటి సంతోష్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపం నుంచి జిల్లా కేంద్రంలో విధుల గుండా మెగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీకి ఉమ్మడి తెలంగాణవ్యాప్తంగా వేలాదిమంది సీనియర్ మాస్టర్లు. ధ్యానులు హాజరుతున్నారన్నారు. అనంతరం టీడీపీ కల్యాణ మండపంలో శాఖాహారంపై అవగాహన సదస్సు ఇందులో సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని 9 పశువుల మృత్యువాత



రైలు ఢీకొని తీవ్రంగా గాయపడటంతో చికిత్స కోసం బయటకు తీస్తున్న గ్రామస్తులు

తలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నాందేడ్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొని తొమ్మిది పశువులు మృతి చెందినట్లు రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు. సంచార జీవులు మధుర జాతికి చెందిన పశువుల యజమానికి చెందిన పశువుల మందను తన కాపరి ఒక వ్యవసాయ పొలం నుంచి మరో వ్యవసాయ పొలానికి మేత కోసం దాటి వేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే, మహారాష్ట్ర నాందేడ్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న ప్యాసింజర్ రైలు పశువుల మందను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మొత్తం ఐదు పశువులు మృతి చెందగా.. మరో నాలుగు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వాటిని వైద్యం చేయించేందుకు పశు వైద్యులను సంప్రదించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, దాదాపు రూ.లక్షా ఇరవై వేల వరకు ఆర్థిక నష్టం జరిగిందని పశువుల యజమాని కర్తక్ ఆవేదన వ్యక్తం చేశారు.



● తలమడుగు సమీపంలో రైలు ఢీకొని మృతి చెందిన పశువులు



వ్యాక్సిన్‌లు వేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు

'పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి'

నార్నూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా సకాలంలో టీకాలు వేయించుకోవాలని వైద్య సిబ్బంది చౌహాన్ చరణ్ దాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని సబ్ సెంటర్ జిన్‌గూడ, నార్నూర్ గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీల, ఎం.శీల, జంగుబాయ్, అంగన్‌వాడీ పంచశీల ఆశా వర్కర్ డి.సుగుణ పాల్గొన్నారు.

అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యువ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డి.అరుణ హేమర్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్, డిస్కస్ త్రో విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుపొందారు. ఎ.అనిల్ ట్రిపుల్ జంప్ విభాగంలో సిల్వర్ మెడల్, బి.స్వాతి హేమర్ త్రో విభాగంలో బ్రాంచ్ మెడల్, ఆర్.వంశీ హేమర్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్ బహుమతులను గెలుచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత, అధ్యాపకులు అరుణ్‌కుమార్, సంతోష్ కుమార్, అష్రఫ్‌అలీ విద్యార్థులను అభినందించారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు

మావల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డ ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం మండలంలోని వాఘపూర్ గ్రామానికి చెందిన చాకటి దేవ్‌రావు ఆయన పంట చేనుకు వెళ్తుండగా.. అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి ఒక్కసారిగా అయనపై పడి తీవ్రంగా దాడి చేసింది. అరుపులు కేకలు వేయడంతో పక్క చేనులలో వాళ్లు ఎలుగుబంటిని పారాదోలారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ను రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులు ఆ రైతును పరామర్శించారు. ప్రస్తుతం రైతు ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం ఉట్నూర్ మండలకేంద్రంలో నరేందర్ రెడ్డికి మద్దతుగా విస్తృతంగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా టాస్క్ : రాణి

ఉట్నూర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) శిక్షణతో యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువు చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతోందని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రాణి అన్నారు. శనివారం ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 21 సెంచరీ ట్రాన్సరబుల్ స్కిల్స్ అంశంపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కాగా, ఈ తరగతులలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైతు వేదికలకు తాళం

(5వ పేజీ తరువాయి...)

పనులకే ఏఈవోలు, ఏవోలు పరిమితమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో పర్యటించి అధిక పంట దిగుబడులను సాధించే విధంగా రైతులను ప్రోత్సహించాల్సిన అధికారులు.. అవేమీ పట్టించుకోవం లేదంటున్నారు. అడపాదడప పంటల సర్వే, రైతుబీమా పథకాల పర్యవేక్షణ కోసమే గ్రామాలకు వచ్చిపోతున్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు. ఎవరైనా రైతులు మరణిస్తే సంబంధిత ఏఈవోలకు ఫోన్లోనే సమాచారం ఇచ్చి ఆధార్‌కార్డు, భూపట్టా పాసుబుక్ వివరాలను రైతు కుటుంబ సభ్యులే పంపుతున్నారు. దీంతో మండల కార్యాలయాలకే ఏఈవోలు పరిమితమవుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం కౌలు రైతులకు పత్తిపంటను అమ్ముకునేందుకు ఏఈవోల ధ్రువీకరణ తప్పనిసరి చేస్తూ నిబంధన విధించింది. దీంతో అధికారుల కోసం రైతులు మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్కడ కూడా అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్ని సందర్భాల్లో గ్రామ, మండలస్థాయి నేతలతో ఫోన్లు చేయిస్తేనే ఏఈవోలు అందుబాటులోకి వస్తున్నట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించకుండానే టీఆర్ పత్రాలను ధ్రువీకరించడంతో అవినీతి అక్రమాలకు దారితీస్తోంది.

శిథిలాలుగా మారుతున్న వేదికలు

ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు హడావుడిగా రైతువేదికల నిర్మాణ పనులను పూర్తి చేయడంతో వేదికల నాణ్యత మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఇప్పటికే చాలాచోట్ల భవన నిర్మాణాలు బీటలువారి కనిపిస్తున్నాయి. దీనికి తోడు నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల తలుపులు, కిటికీలు విరిగిపోయి కనిపిస్తున్నాయి. ఆరుబయట వేసిన టైల్స్ పగుళ్ల తేలి కనిపిస్తున్నాయి. పునాదులు బీటలు వారడంతో ఎప్పుడు కూలిపోతాయో? చెప్పలేని పరిస్థితి ఉందంటున్నారు. కొన్నిచోట్లనైతే మరుగుదొడ్లు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇకనైనా మరమ్మతులు చేపడితేనే మరికొన్నాళ్ల పాటు అందుబాటులో ఉంటాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఏఒక్క రైతువేదిక నాణ్యత ప్రమాణాల ప్రకారం నిర్మించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొత్తానికి గత ప్రభుత్వం రైతు సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి వేదికలు నిర్మించినా.. పరిష్కారం చూపే వారే కరవవుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నర్సాపూర్ (జి) వద్ద అదుపు తప్పిన బైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు ● పరిస్థితి విషమం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్ (జి) పోలీసు స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి 11.30 గంటలకు ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భైంసా పట్టణానికి సంతోష్, గౌతం అనే ఇద్దరు యువకులు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. విధులు ముగించుకొని తిరిగి భైంసాకు వెళ్తుండగా.. మార్గమధ్యలో నర్సాపూర్ (జి) ప్రధాన రహదారిపై అతివేగంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో.. పోలీసులు వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జు అయిన బైక్



గాయపడ్డ యువకుడు

నరేందర్‌రెడ్డికి భారీ మెజారిటీ వచ్చేలా శ్రమించాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పక్షాన బరిలో నిలిచిన నరేందర్ రెడ్డికి ఖానాపూర్ ప్రాంతంలో భారీ మెజారిటీ వచ్చేలా పార్టీ శ్రేణులు శ్రమించాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సత్తెనపల్లి గ్రామంలో జగదాంబదేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, పెంబి మండల అధ్యక్షులు స్వప్నిల్‌రెడ్డి, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, గుడాల రాజన్న, పరిమి సురేష్, కొడిమెల వీరేష్, రమేష్, గంగారెడ్డి, తదిరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రచారం చేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం ఉదయం రాష్ట్ర విత్తన అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉదయం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాసేపు వాకింగ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యోగుల పక్షపాతి అని ఎల్లవేళలా ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఆలోచించే పార్టీ అని గుర్తు చేశారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, ఏఎంసీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి, యువజన విద్యార్థి సంఘం అధ్యక్షులు సమరసింహ రెడ్డి, రాకేష్, కొండా శ్రీనివాస్, గంగోని భూరాజ్, మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, మొహమ్మద్ రఫీ, కాంగ్రెస్ నాయకులు గాజుల రవికుమార్, కొంతం గణేష్, గజేందర్, జిషాన్ అలీ, అడపా శ్రీకాంత్, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గెలిపించండి

మామడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజుల నుండి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పలు అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీగా గెలిపించాలని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లు ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రఫీ, బాపయ్య, గంగారెడ్డి, మంగు లింగన్న, సల్కం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టభద్రుల పక్షపాతి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల పక్షపాతి అని ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం యువజన కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్టచర్యలు

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై పాత్రికేయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 46 ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 19 వేల 107 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నట్లు తెలిపారు. ఇందులో 17 వేల 141 మంది పట్టభద్రులు, 1966 మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 149 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎన్నికల సామాగ్రిని ఈ నెల 26వ తేదీన ఎన్నికల అధికారులకు అప్పగిస్తామన్నారు. రేపటి నుంచి 26వ తేదీ వరకు ఓటరు గుర్తింపు స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. ఓటరు ఓటు వినియోగంపై అవగాహన పెంపొందించడానికి ఆర్డీవో కార్యాలయంలో 24, 25వ తేదీల్లో అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు మాస్టర్ ట్రైనర్లచే రెండుసార్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పౌర సరఫరాలశాఖపై కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై యాప్‌ను తయారు చేసినట్లు తెలిపారు. సమయానికి సీఎంఆర్ బియ్యాన్ని అందివ్వని 8 మంది రైస్ మిల్లర్లను గుర్తించి రెవెన్యూ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పరిహారం చెల్లించని మిల్లర్ల నుంచి దాదాపు 30 ఎకరాల భూమిని, ఇతర ఆస్తులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి బ్లాక్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో బియ్యం అక్రమ రవాణా జరగకుండా అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుపరుస్తున్న బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 20 వేల మంది విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య కార్డులను రూపొందించినట్లు తెలిపారు. నిర్మల్ ఉత్సవాల విజయవంతంలో కీలకపాత్ర పోషించిన పౌర సంబంధాల అధికారిణి, ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీం, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులంతా తమ విధుల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అధికారులకు ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత నిర్వహించవలసిన విధులపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, అన్నిరకాల ఫారములతో నమూనా ఓటింగ్ ప్రక్రియను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 46 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, వీల్‌చైర్లు, మరుగుదొడ్లు, విద్యుత్, తదితర వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల న్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల రోజు ముందు, ఉదయమే ఎన్నికల విధులు నిర్వంహిచే అధికారులు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియానికి చేరుకొని తమకు కేటాయించిన ఎన్నిలక సామాగ్రిని తీసుకొని, తమకు ఇచ్చిన సామాగ్రిని ఒకటికి రెండుసార్లు సరి చేసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రారంభం కాగానే ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ వివరాలను పై అధికారులకు అందజేయాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సామాగ్రిని జాగ్రత్తగా నిర్దేశిత ప్రదేశాలకు చేర్చాలన్నారు. అనంతరం అధికారుల సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు. ఈ శిక్షణ సమావేశంలో మాస్టర్ ట్రైనర్లు రవి, లింబాద్రిలు, ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడు?

కుభీర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేని గ్రామాల్లో చేపట్టిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఒక్కో గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ఉపాధిహామి పథకం కింద ప్రభుత్వం రూ. 20లక్షలు మంజూరు చేసింది. కుభీర్ మండలంలోని బెల్గాం తాండా 1, బ్రహ్మేశ్వర్ తాండలో నిర్మాణ పనులు రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. నెలలు గడుస్తున్న పనులు జరగక అసంపూర్తిగా నిలిచిపోయాయి. స్లాబ్ నిర్మాణాలు చేపట్టిన గోడలు, మితగ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం పంచాయతీ కార్యకలాపాలు అద్దె గదిలో అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. ఎన్నికలు రాకముందే భవన నిర్మాణాలు పూర్తి చేస్తే పరిపాలన సౌలభ్యంగా ఉంటుందని తాండవా వాసులు చెప్పుతున్నారు. ఈ విషయమై పీఆర్ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ గుత్తేదారుకు బిల్లులు చెల్లింపు నిలిచి పోవడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని పనులను పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యమైన విద్య అందించడం అభినందనీయం

ముథోల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఆంగ్లంలో నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం లిటిల్ ఫ్లవర్ స్కూల్ 25వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాసర ఎంఈవో మైసాజీ, ప్రిన్సిపాల్ నజీబ్, కరస్పాండెంట్ దిగంబర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు మురళీధర్ రెడ్డి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అర్గుమీది రామ్‌రెడ్డి సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మురళీధర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

పెంబి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయదారి గ్రామంలో ఇటీవల సంభవించిన విద్యుత్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను శనివారం ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల ఇళ్లను పరిశీలించారు. 3 కుటుంబాలకు 10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ... విద్యుదాఘాతంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని హామీ ఇచ్చారు. అన్ని విధాలుగా కుటుంబాలను అందుకుంటామన్నారు. అనంతరం కోరుకంటి తాండ గ్రామస్థులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానన్నారు. నాగపూర్ గ్రామానికి చెందిన మైసయ్య ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దయానంద్, రాజుర సత్యం, తులాల శంకర్, మాజీ సర్పంచ్ మహేందర్, బోరె రమేష్, ఖాన్, రమేష్, తదితరులు ఉన్నారు.

కార్యదర్శులతో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై సమావేశం

ముథోల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా పటిష్టచర్యలు చేపట్టేందుకు శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అరుణ్‌లు పలు సలహా, సూచనలు ఇచ్చారు. తాగునీటికి ఎలాంటి కొరత లేకుండా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంలో సరైన పర్యవేక్షణ, సమన్వయంతో ముందుకెళ్లి తాగునీటి సమస్య తలెత్తకుండా చూద్దామ న్నారు. స్థానికంగా ఉన్న బోర్లు,మోటార్లు రిపేర్లు చేయించాలన్నారు. లీకేజీలు లేకుండా చూసుకోవాలని అవసరమైతే ప్రైవేట్ బోర్లు లీజుకు తీసుకుని నీటి సరఫరా చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకుని, పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. గ్రామాల వారీగా వేసవి యాక్షన్‌ప్లాన్ గురించి చర్చించారు. నీటి వృధాను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి వనరులు, సరఫరా వ్యవస్థలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. వందశాతం ఇంటి పన్నులను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

రామాలయ సమీపంలో కల్లు బట్టిని తొలగించాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామన్‌పెల్లిలో గల తెల్లకల్లు (మద్యపానం) దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థులు శనివారం ఆంధ్రజ్యోతికి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ తెల్లకల్లు బట్టి (దుకాణం) వద్ద స్థానిక ప్రజలు, ద్విచక్ర వాహనాల కారణంగా రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ఈ తెల్లకల్లు సేవించిన వ్యక్తులు రోడ్డుకు ఇరువైపులా మూత్ర విసర్జన చేయటం వలన లక్ష్మణ చాంద పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు (బాలికలు), మండల కేంద్రానికి వెళ్తున్న మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రామాలయ సమీపంలోనే ఈ తెల్లకల్లు దుకాణం ఉండటం వలన అపవిత్రతకు అవకాశం ఉందన్నారు.

ఫటా..ఫట్...

బర్డ్‌ఫ్లూతో చికెన్ విక్రయాలు డమాల్

● పర్వేజ్ అహ్మద్, పశు వైద్యాధికారి, బజార్‌హత్నూర్



బర్డ్ ఫ్లూ తో చికెన్ విక్రయాలు డమాల్ అవ్వడంతో వినియోగ దారులు ఎవరు చికెన్ మంసాన్ని కొనేందుకు ఇష్టపడటం లేదు. దీంతో చికెన్ విక్రయదారలు కొన్ని రోజులు విక్రయాలకు దూరంగ ఉండాల్సిందే. మాంసం విక్రయాలపై మండల పశు వైద్యాదికారి పర్వేజ్ అహ్మద్‌తో ఇంటర్వ్యూ..

ఆంధ్రజ్యోతి: మండలంలో మాంసం విక్రయాలు ఎలా జరుగుగతున్నాయి.

పశువైద్యాధికారి: కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో చికెన్ విక్రయాలు పూర్తిగా మందగించాయి. ప్రజలు చికెన్ మాంసాన్ని తినేందుకు నిరాకరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో ప్రజలకు మీరిచ్చే సలహ ఏమిటి.

పశువైద్యాధికారి: ప్రస్తుతం కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో ప్రజలు కొంత కాలం వరకు చికెన్‌ను తినక పోవడం మంచిది. చికెన్ స్తానంలో మేక మాంసం, చేపలు, రొయ్యలు వంటి వాటిని మాత్రమే తీసుకోవడం చాలా మంచిది.

ఆంధ్రజ్యోతి: మండలంలో మాంసం విక్రయ దారులకు మీరు ఎలాంటి సూచనలు చేస్తున్నారు.

పశువైద్యాధికారి: మండలం పరిదిలోని అన్ని గ్రామాలలో కొంత కాలం చికెన్ విక్రయాలను ఆపేయాలని, దాని స్థానంలో మేక మాంసంను విక్రయించాలని, మాంసం విక్రయ దారులకు సూచిస్తున్నాం. ఆరోగ్యంగా ఉన్న మేకల నుండి మాత్రమే మాంసంను సేకరించి వినియోగదారులకు అందించాలని సూచించాం

ఆంధ్రజ్యోతి: మాంసం శాపులను ఎప్పుడెప్పుడు తనిఖీ చేస్తున్నారు.

పశువైద్యాధికారి: మండలం పరిదిలోని మాంసం వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశాం. వినియోగదారులకు నాణ్యమైన మాంసాన్ని మాత్రమే అందించాలని, ఎక్కడైన రోగాల బారిన పడిన మేకల మాంసాన్ని విక్రయిస్తే తమ దృష్టికి తీసుకువస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారం పరిదిలో అకస్మికంగా మాంసం విక్రయించే శాపులను తనిఖీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మాంసం విక్రయ శాపుల వద్ద పరిశుభ్రతను పాటిస్తున్నారా.

పశువైద్యాధికారి: ప్రతీ మాంసం విక్రయ శాపుల వద్ద పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం పాటించాలని విధిగ వారికి సూచించాం, మాంసంపై దుమ్ము, ఈగలు వాలకుండా జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించాం.

● (ఆంధ్రజ్యోతి, బజార్‌హత్నూర్)

మల్లాపూర్‌లో యజ్ఞం, ప్రత్యేక పూజలు



మల్లాపూర్ గ్రామంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హను మాన్ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల సందర్భంగా శనివారం యజ్ఞంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చిత్రం.. విచిత్రం!

● రామ చిలుకలు కాదు.. పత్తికాయలు



ఇచ్చోడ, ఫిబ్రవరి, 22 (ఆంధ్రజ్యోతి) : ఈ చిత్రంలో కని పిస్తున్న చెట్టుకు రామచిలుకల వేళాడుతున్నట్లు కనిపిస్తుంది. ఇచ్చోడ మండలం జామిడి రహదా రికి ఇరువైపులా నాటిన బూరుగు పత్తి చెట్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆకులు మొత్తం రాలిపోవడంతో చెట్టు నిండా కాసిన కాయలు రామ చిలుకల్లా వేలాడుతున్నట్లు కనిపిస్తూ ఆకర్షిస్తున్నాయి. అటుగా వెళ్లిన ప్రయాణికులు చెట్లను ఆసక్తికరంగా చూస్తున్నారు.

రాజస్థాన్ కుండలతో లోకల్ కుండలకు దెబ్బ



అమ్మకానికి పెట్టిన రాజస్థాన్ కుండలు



అమ్మకానికి పెట్టిన కుమ్మరుల కుండలు

ఉట్నూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుమ్మరులు తయారు చేస్తున్న స్థానిక కుండలకు రాజస్థాన్ కుండలు రావడంతో దెబ్బ పడుతుంది. వేసవి ఎండలు ముదురు తుం డడంతో చల్లని నీరు తాగాలని ఉబలాటపడుతున్న ప్రజలు ఆదిలా బాద్ జిల్లాలో తయారయ్యే కుమ్మరులు చేసే మట్టి కుండలోని నీరు తాగాలని భావిస్తుంటారు. అదిలాబాద్ జిల్లాలోని కుండలకు (రంజాన్) తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, నగరాల్లో, పట్టణాలలో వారి డిమాండ్ ఉంది. గతేడాది కాలంగా రాజస్థాన్ కుండలు రావడంతో స్థానిక కుమ్మరుల ఆదాయానికి గుండి పడుతుంది. కుమ్మరులే కొందరు ఆదిలాబాద్ నుంచి రాజస్థాన్ కుండలను కొనుగోలు చేసి ఉట్నూర్ ప్రాంతంలో విక్రయిస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని కుమ్మరి తండా, లక్కారంలలో ఉన్న కుమ్మరి కుటుంబాల వారు కొందరు కుండలు తయారు చేస్తూనే రాజస్థాన్ కుండలను కూడా విక్రయిస్తున్నారు. రాజస్థాన్ కుండా రూ.350కి అమ్ముతుండగా స్థానిక రంజన్‌లు ఒకటి చిన్నది రూ.100, పెద్దది రూ.150 నుంచి రూ.200 కు విక్రయిస్తున్నారు. ఏది ఏమైనా రాజస్థాన్ కుండలో రావడంతో స్థానిక కుండలకు గిరాకీ తగ్గిందని కుమ్మరులు వాపోతున్నారు.

సుంకిడి పాఠశాలలో ఆకర్షించిన మాక్ అసెంబ్లీ





సుంకిడి పాఠశాలలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలం సుంకిడి ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ కార్యక్రమం కళ్ళకు కట్టినట్లుగా విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించారు. శాసనసభ సభాపతిగా (స్పీకర్గా) ఆదిరాజ్ పదో తరగతి విద్యార్థి నిర్వహించగా శాసనసభ్యులుగా విద్యార్థులు భవాని, కృతిక, అశ్విత, అజయ్, శ్రీవాణి, ఆకాంక్ష, హాసిని ఎమ్మెల్యే పాత్రలను నిర్వహించగా, రవాణా శాఖ మంత్రిగా అవంతిక, హోం శాఖ మంత్రిగా సుప్రియ, విద్యాశాఖ మంత్రిగా అలేఖ్య, ఆరోగ్య శాఖ మంత్రిగా హరిణి, ఉపాధ్యాయులు ఆర్థిక శాఖ మంత్రిగా ముస్కాన్, ఆరోగ్య శాఖ మంత్రిగా హర్షిని, వ్యవసాయ శాఖ మంత్రిగా మంత్రిగా శశిరేఖ, పర్యావరణ శాఖ మంత్రిగా శిరీష, అటివి శాఖ మంత్రిగా రింశ వ్యవహరించారు. కాగా సభ లో మూడు బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింప చేశారు. ఆ తర్వాత అసెంబ్లీలో జరిగిన చర్చ కళ్ళకు కట్టినట్టుగా కనిపించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అసెంబ్లీలో జరిగే సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా ముందు ఉంచారణి ఇలాగే అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి గజానన్ రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమంలో వై. రాంరెడ్డి సుకుమార్ పెట్కులే, సుజాత, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి మేడం, సత్యనారాయణ, మహేందర్, నరేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బాబాపూర్‌లో ఘనంగా శివ పార్వతుల కల్యాణం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్‌లో గల రాజరాజేశ్వర ఆలయంలో శివ పార్వతుల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్బంగా వేద మంత్రోచ్చరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బాబాపూర్‌లోని ఆలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



రథాన్ని లాగుతున్న భక్తులు

యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు





యూరియా కోసం వేచి చూస్తున్న రైతులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో యూరియా కొరతతో ఇబ్బందులు పడవలసి వస్తుంది. ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ద్వారా యూరియా సరఫరా చేయగా రైతులకు సరిపడా యూరియా ఇవ్వడం లేదని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుండి క్యూలైన్‌లో మధ్యాహ్నా వరకు వేచి ఉన్న యూరియా దొరడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నా

● సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనప్ప



సీఎం రేవంత్ రెడ్డితో మాజీ మంత్రి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తాము కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పష్టం చేశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో పాటు ఆయన శనివారం హైదరాబాద్‌లో సీఎంను కలిశారు. బీఆర్ఎస్ పార్టీ చేసే తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ నెల 24న సీఎం నిర్మల్ పర్యటన దృష్ట్యా ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక ఎన్నికలపై ఇంద్రకరణ్ రెడ్డి సీఎంతో చర్చించారు.

సుంకిడిలో ప్లాస్టిక్ కవర్లను ఊడ్చి తగులబెట్టిన పంచాయతీ సిబ్బంది



ప్లాస్టిక్ కవర్లను తగలబెడుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ప్లాస్టిక్ కవర్లతో పశువులకు పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచూరిన కావడంతో వెంటనే స్పందించిన ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఈఓ వినోద్ కుమార్, పంచాయితీ సెక్రటరీ సచిన్‌లు సుంకిడి గ్రామపంచాయతీ సమీపంలో గల ఎద్దుల అంగడి సమీపంలో గల ప్లాస్టిక్ కవర్లను, చెత్తాచెదారంలో గ్రామ పంచా యతీ సిబ్బందితో ఊడ్చి తగల బెట్టారు. ఈ సందర్భంగా అధికారు గ్రామ స్థులు ఎవరు కూడా చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను రోడ్లపై వెయ్యవద్ద న్నారు. గ్రామాల్లోకి వచ్చే చెత్త బడిలోనే ప్లాస్టిక్ కవర్లు చెత్తను వేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ సిబ్బంది చెత్తాచెదారంలో, ప్లాస్టిక్ కవర్లను గుంతలో వేసి తగలబెట్టాలని సూచించారు. ఎవరైనా రోడ్లపై చెత్త చెదారం వేస్తే జరిమానా విధించాలని కోరారు. అదేవిధంగా పశువులకు రాష్ట్ర కవర్లు అందకుండా చూడాలన్నారు. కాగా ప్లాస్టిక్ కవర్లపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచరణ కావడంతో గ్రామస్తులు ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని అభినందించారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు కాంగ్రెస్ నేతల నివాళి



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

భైంసా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ; రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హమ్దాన్, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలు మాట్లాడుతూ. విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ విద్య అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అవిరళంగా కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పకడ్బందీ చర్యలు చేపట్టారని వెల్లడించారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఆనంద్ రావ్ పాటిల్, వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మాద్, మాజీ చైర్మన్ మురళీగౌడ్, మైనార్టీ ప్రతినిధి హైమద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.







మేకల సంత, మటన్ షాపు వద్ద బారులు తీరిన జనాలు

ఫోటో న్యూస్



బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

మేకలకు పెరిగిన గిరాకీ..

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ విక్రయాలు నిలిచిపోయాయి. గిరాకీలు లేకపోవడంతో చికెన్ వ్యాపారస్థులు విక్రయాలను నిలిపివేయగా కోడి మాంసంను కొనేందుకు సైతం జనాలు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో మేకలకు మంచి డిమాండ్ ఏర్పడింది. శనివారం పాత బస్టాండ్ వద్ద జరిగిన మేకల సంత కిక్కిరిసి కనిపించింది.

● (ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్)



గెలుపు కోసం కాంగ్రెస్ కసరత్తు



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పకడ్బందీ ప్రణాళికతో కాంగ్రెస్ ముందుకు
- రేపు నిర్మల్‌లో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం
- స్థానిక సాగర్ కన్వెన్షన్ హాల్‌లో గ్రాడ్యుయేట్‌లతో ఆత్మీయ సమావేశం
- హాజరుకానున్న ఉమ్మడి జిల్లా శ్రేణులు, గ్రాడ్యుయేట్‌లు

నిర్మల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో భారీ మెజార్టీ సాధించుకోవాలని ఆ పార్టీ కసరత్తు మొదలుపెట్టింది. దీనికి అనుగుణంగా పకడ్బందీ వ్యూహాలతో పావులు కదుపుతోంది. ఓ వైపు బీజేపీ, బీఎస్పీ పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను సవాలుగా తీసుకుంటోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా జిల్లాలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఏకంగా తమ అభ్యర్థి గెలుపు కోసం సీఎం రేవంత్‌రెడ్డినే రంగంలోకి దించింది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి సోమవారం నిర్మల్‌లో జరిగే గ్రాడ్యుయేట్‌ల ఆత్మీయ సమావేశానికి హాజరుకానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను అత్యంత సవాలుగా తీసుకుంటుండడంతో ప్రచార పర్వం మరింత ఊపందుకోబోతోంది. ఈనెల 27వ తేదీన ఈ ఎన్నిక జరగబోతున్నందున ప్రచారానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో కాంగ్రెస్ పార్టీ ఇక తన వ్యూహాలకు మరింత పదును పెట్టబోతోంది. నాలుగు జిల్లాల డీసీసీ అధ్యక్షులకు అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జీలకు ఆ పార్టీ కీలక ప్రచార బాధ్యతలను అప్పజెప్పింది. అలాగే రాష్ట్రస్థాయి నాయకులు పోటాపోటీగా పర్యటిస్తూ తమ అభ్యర్థి తరపున ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులెవరు కూడా రంగంలో లేకపోవడంతో ఆ పార్టీ తన దృష్టినంతా గ్రాడ్యుయేట్ అభ్యర్థిపైనే కేంద్రీకరిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి తన అనుచరులు మొదటి దశ ప్రచారాన్ని పూర్తి చేసిన సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ ఆయన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ఖరారు చేయడంతో ప్రచార పర్వం పతాకస్థాయికి చేరుకుంటోంది. ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారాన్ని చేపడుతుండగా పార్టీ శ్రేణులు సైతం గ్రామస్థాయిలో గ్రాడ్యుయేట్‌లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. రోజురోజుకు ప్రచార పర్వం ఊపందుకుంటున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రచార రంగంలోకి దిగడంతో కాంగ్రెస్ పార్టీకి మరింత ఊపు లభించబోతోందని అంటున్నారు. నిర్మల్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మీయ సమావేశానికి భారీ సంఖ్యలో పార్టీ కేడర్‌ను భారీ సంఖ్యలో సమీకరించి ప్రత్యర్థులకు సవాల్ విసరాలని ఆ పార్టీ భావిస్తోంది.

సీఎం ఆత్మీయ సమావేశానికి భారీ ఏర్పాట్లు

జిల్లాకేంద్రంలో సోమవారం జరగనున్న గ్రాడ్యుయేట్‌ల ఆత్మీయ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండడాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ మేరకు ఆత్మీయ సమావేశాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేసి తన సత్తాను చాటుకోవాలని ఆ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి సీఎం ఆత్మీయ సమావేశం కోసం పార్టీ నాయకులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌ను ఆ దిశగా సమాయత్తం చేస్తున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో పాటు మరికొంతమంది రాష్ట్ర నాయకులు నిర్మల్‌లోనే మకాం వేసి సీఎం ప్రచార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో జోష్

కాగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంధర్‌రెడ్డి తరపున ప్రచారం చేపట్టేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్మల్‌కు రానుండడంతో ఆ పార్టీలో కొత్త జోష్ నెలకొంటోంది. సీఎంగా మొదటిసారి రేవంత్‌రెడ్డి నిర్మల్‌కు వస్తున్న కారణంగా ఆయన పర్యటనను విజయవంతం చేసి పార్టీ సత్తాను చాటుకోవాలని భావిస్తున్నారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను అలాగే గ్రాడ్యుయేట్‌లను రప్పించి బలనిరూపణ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు యోచిస్తున్నారు. ఎన్నికలు ముగిసి ఏడాది గడిచిపోతున్నప్పటికి ఇప్పటి వరకు ఆ పార్టీ పరంగా ఎక్కడ కూడా భారీ కార్యక్రమాలు జరగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా స్థాయి నాయకులు ఎక్కడికక్కడ ప్రచారాలు నిర్వహిస్తున్నప్పటికి కేడర్‌లో రెట్టింపు ఉత్సాహం నింపే నేతలు ఎవరు కూడా జిల్లాలో పర్యటించలేదు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్మల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటుండడం ఆ పార్టీకి రెట్టింపు ఉత్సాహాన్నివ్వబోతోందని చెబుతున్నారు.

ప్రత్యర్థులకు ధీటుగా..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అలాగే బీఎస్పీతో పాటు ఇండిపెండేట్ అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. ప్రధాన పార్టీలకు తీసిపోని విధంగా స్వతంత్ర్య అభ్యర్థులు సైతం ప్రచారం నిర్వహిస్తుండడంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ప్రధానంగా బీజేపీ అభ్యర్థి కూడా ధీటుగా ప్రచారాన్ని నిర్వహిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నలుగురు పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ సహకారంతో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి అలాగే టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురన్నలు గత పది రోజుల నుంచి తమ ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తూ అధికార కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరెంత పని చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ అభ్యర్థులకు ఆ పార్టీ అనుబంధ సంఘాలు రంగంలోకి దిగి అన్ని రకాల ప్రచారాన్ని కొనసాగిస్తుండడంతో గెలుపుపై ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లా రాజకీయ పరిస్థితులను విశ్లేషించిన సీఎం రేవంత్ రెడ్డి ఇక తాడోపేడోకు సిద్ధమవుతూ తానే స్వయంగా తమ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంధర్ రెడ్డి తరఫున ప్రచారం చేపట్టేందుకు రంగంలోకి దిగబోతుండడంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారపర్వం మరింత ఆసక్తికరంగా మారబోతోందంటున్నారు.

మున్సిపాలిటీలో గ్రామాలను విలీనం చేయాలి

- భైంసా బీజేపీ ప్రతినిధులు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న పార్టీ ప్రతినిధులు

భైంసా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీలలో కొనసాగుతున్న గ్రామాల విలీన ప్రక్రియ విధానాన్ని తమ మున్సిపల్ పరిధిలోనూ అమలయ్యేలా చూడాలని భైంసా బీజేపీ ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమం ముగిసిన అనంతరం భైంసా బీజేపీ ప్రతినిధులు ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సంబంధిత విషయంలో మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా గ్రామాల విలీన ప్రక్రియ భైంసా మున్సిపల్ పరిధిలో కొనసాగడం లేదని వివరించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధిత విషయంలో వినతి పత్రాలు, విజ్ఞప్తులు చేసిన నేటికి స్పందన రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి భైంసా మున్సిపాల్టీలో గ్రామాల విలీనం అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటి మాజీ అధ్యక్షులు గాలి రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సార్డా, నగర్ నారాయణ్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నారు.

గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం

సోన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంతో పాటు న్యూ వెల్మల్ బొప్పారం, కూచన్‌పెల్లి, సాకెర, కడ్తాల్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. ఇందులో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, సరికెల గంగన్న, రాచకొండ సాగర్, నరేష్, నర్సారెడ్డి, నాగయ్య, సాయినాథ్, సాయన్న, సుధాకర్ రెడ్డి, భీమ్ రావు, మక్కన్న, అమృత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిపో మేనేజర్ హరిప్రసాద్

భైంసా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ; బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ ద్వారా సంస్థ పరిరక్షణకు ఆర్టీసీ ఉద్యోగులు అంకితమవ్వాలని భైంసా బస్ డిపో మేనేజర్ హరిప్రసాద్ సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు శనివారం సంస్థ ఉద్యోగులకు పవర్ ట్రెయినింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ సంస్థ మనది అనే భావన పెంపొందించుకొని విధులను చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో ప్రయాణికులు సైతం మనవారు అనే దొరణితో వ్యవహరించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీలో చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులు, చేర్పులకు అనుగుణంగా విధులను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులందరితో పాటు పవర్ ట్రేయినింగ్‌లో నేర్చుకున్న అంశాలన్నింటినీ విధుల నిర్వాహణలో తూచా తప్పకుండా అమలుపరుస్తామని ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెండ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(58) ఉరి వేసుకొని మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడు ఇంట్లో కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుతున్న తరువాత ఉదయం నిద్ర లేని చూసే సరికి ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై మాలిక్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

భార్య కాపురానికి రాలేదని బలవన్మరణం



లోకేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో చెట్టుకు ఒకరు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం డబ్బేకర్ బీరప్ప(42) అనే వ్యక్తికి గత 20 సంవత్సరాల క్రితం బోధన్‌కు చెందిన లక్ష్మీ అనే అమ్మాయితో వివాహం జరిగింది. గత కొంతకాలం నుండి బీరప్పకు, లక్ష్మీకి గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయం గురించి ఆమె గత నాలుగు నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లిపోయింది. శుక్రవారం రోజు మృతుడి అక్క నగరిబాయి, మృతుడి స్నేహితుడు సాయినాథులు కలిసి నిజామాబాద్ వెళ్లారు. అక్కడ భార్య కాపురానికి రాను అని చెప్పేసరికి మనస్తాపం చెందిన మృతుడు బీరప్ప భైంసా వరకు అక్క, స్నేహితుడు సాయినాథ్ కలిసి వచ్చి ఆ తరువాత నేను కొద్దిసేపటి తర్వాత వస్తానని చెప్పి వాళ్లను పంపించి ఆ తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో మన్మథ్ ఎక్స్ రోడ్ నుంచి మన్మథ్ గ్రామానికి వెళ్లే దారిలో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. ఈ విషయం గురించి అక్క నగరిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ముగిసిన వెదురు వేలం

ముథోల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామ శివారులో గల ప్రభుత్వ ఉద్యానవనంలో ఉన్న వెదురు కర్రలను (ప్రభుత్వ మోడల్ బాంబు ఫారం) శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. విశ్వనాథ్ అనే వ్యాపారి 100 వెదురు కర్రలకు రూ. 3,065 చొప్పున వేలం పాటను దక్కించుకున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బివి. రమణ తెలిపారు.

రాష్ట్రంలో రాహుల్ టాక్స్ విధిస్తున్నారు

- నాడు కాంగ్రెస్ హయాంలో దేశంలో పాకిస్తాన్ ఐఎస్ఐ కార్యకలాపాలు
- నేడు మోదీ వాటన్నింటికి చెక్ పెట్టారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి



భైంసా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఖానాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పాటు బీఆర్ఎస్ దోచుకుందని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ రాహుల్‌గాంధీ టాక్స్‌ను విధిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖానాపూర్‌లోని తెలంగాణచౌక్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లతో 'ఛాయ్ పే చర్చ' కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌లతో కలిసి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భయపడే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ కట్టినా కాంగ్రెస్ నాయకులు వాటా అడుగుతున్నారని ఆరోపించారు. నాడు కేటీఆర్ ఆధ్వర్యంలో నేడు రేవంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో రాష్ట్రంలో దౌర్జన్యం కొనసాగుతుందన్నారు. నాడు కేసీఆర్ తన కుటుంబం కోసం దోచుకుంటే నేడు రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ కోసం దోచిపెడుతున్నారు. కేసీఆర్ రేవంత్‌రెడ్డిల అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనమైందన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండు ఒకే తాను ముక్కలనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఈ రెండు పార్టీల పాలనలో అభివృద్ధి పరంగా కుంటు పట్టిందన్నారు. కేంద్రంలో అవినీతి లేని పాలన మోదీ ప్రభుత్వం అందజేస్తోందన్నారు. నాడు కాంగ్రెస్ హయాంలో దేశంలో పాకిస్తాన్ ఐఎస్ఐ కార్యకలాపాలు, బాంబుల మోతలు, ఉగ్రవాదుల చర్యలు కనిపించేవని నేడు వాటన్నింటినీ మోదీ ప్రభుత్వం సమూలంగా నిర్మూలించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కడితే మండలిలో మీ సమస్యల పట్ల పోరాడుతారన్నారు. 75 ఏళ్లుగా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాలేదని బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని నిరుద్యోగులు అడిగిన ఓ ప్రశ్నకు సమానంగా కిషన్‌రెడ్డి చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని దాంతో తమకు సర్టిఫికెట్లను కూడా ఇవ్వకుండా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని పలువురు నిరుద్యోగులు కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కిషన్ రెడ్డి రూ. 8,500ల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల సర్టిఫికెట్లకు ముడి పెట్టవద్దని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలను కోరుతున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయమై తాము సైతం ఈ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను యువత కేంద్ర మంత్రి దృష్టికి తీసుకురాగా వాటన్నింటినీ అసెంబ్లీ వేదికగా తమ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు. దేశంలో అమెరికాను తలపించే జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందని దేవంలో విద్యుత్ సమస్యలు లేకుండా సంస్కరణలు చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలను బేరీజు వేసుకుని చూసి ఎన్నికల్లో పాల్గొంటున్న మేధావి వర్గం తమ ఓట్లను వేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి కిషన్‌రెడ్డి ఓటర్లను కోరారు.

ఓ వర్గం ఓట్లను దక్కించుకునేందుకు బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ చీకటి ఒప్పందం

రాష్ట్రంలో ఓ వర్గం ఓట్లను దక్కించుకునేందుకు బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ చీకటి ఒప్పందాన్ని చేసుకుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుంభకోణం జరిగిందని, అవినీతి రాజ్యమేలుతోందని ఆనాడు టీపీసీసీ ప్రెసిడెంట్‌గా గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ అరువు తెచ్చుకున్న అభ్యర్థిని నిలబెట్టింది

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరువు తెచ్చుకున్న అభ్యర్థిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి పెట్టిందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న వ్యక్తి విద్యార్థుల నుండి ముక్కు పిండి ఫీజులు వసూలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామచందర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు హరినాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, ఖానాపూర్ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, కడెం మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, పెంబి మండలం అధ్యక్షులు ఐదు వెంకటేష్ సహా పలువురు జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పేందుకు బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

భైంసా, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ; రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజానీకానికి తీరని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగురీతిలో గుణపాఠం నేర్పాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు , కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారసభలో మాట్లాడారు. 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజానీకానికి ఒరిగిందేమి లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఆరు గ్యారెంటీలతో పాటు 420 ఎన్నికల హామీలను అమలు పర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన తీరునే ప్రస్తుత కాంగ్రెస్ పాలన కొనసాగుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్‌తో పాటు ఇతర ప్రయోజనాలను అందించలేకపోయాయన్నారు. కాలయాపనతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీతో పాటు డీఏలు సకాలంలో అందివ్వలేకపోయాయన్నారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి, నీతికి, అవినీతికి మధ్య జరుగుతున్నాయన్నారు. మేధావులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు సరైన రీతిలో ఆలోచించి అధర్మ రీతిలో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పేందుకు గాను బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్ మాట్లాడుతూ.. అసమర్థత కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడేందుకు గాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ మాట్లాడుతూ.. భైంసా మున్సిపాల్టీని ఎంఐఎం పాలన నుంచి విముక్తి కల్పించేందుకు గాను పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణ్‌రెడ్డి, గోపాల్‌సార్డా, ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాల గురుకుల ప్రవేశపరీక్ష

కుంటాల , ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో ఆదివారం ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షల నిర్వహించబడునని, విద్యార్థులు సకాలంలో చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉంటుందని, పరీక్ష కేంద్రం చుట్టు ఎవరు కూడా ఉండకూడదని తెలిపారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు ఉన్నత స్థాయి చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత చాలా ముఖ్యమని, విద్యపట్ల వారు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉర్దూ ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అక్రమ్ ఫాతిమా సూచించారు. శనివారం మండలంలోని ఉర్దూ స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశానికి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మజీద్, నజియా, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం ప్రణాళికలో భాగంగా సారంగాపూర్ మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పత్రిక ప్రటనలో విద్యుత్ అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కౌట్ల(బి), స్వర్ణ ఉప కేంద్రం పరిధిలో 33 కేవీ లింక్ లైన్ వేస్తున్నామని ఇందులో భాగంగా ఆదివారం, సోమవారం రోజు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ మూడు గంటల అంతరాయాన్ని రాత్రి సమయంలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సోఫీనగర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించే ప్రవేశపరీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఉదయం 11 నుండి 1 వరకు పరీక్ష నిర్వహిస్తారని ఆధార్ కార్డు, హాల్ టికెట్‌తో రావాలన్నారు. వివరాలకు 7995660879 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

దివ్యాంగులకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పరిధిలో దివ్యాంగులకు కంప్యూటర్ కోర్సుల్లో 45 రోజులపాటు ఉచిత శిక్షణ ఉద్యోగం కల్పించనున్నామని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆరనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయన్న తెలిపారు. దూర ప్రాంతాల వారికి ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు మార్చి 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు 8885512035 ఈ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టి శాట్ ద్వారా విద్యార్థుల సందేహాల నివృత్తి

ఖానాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం టి శాట్ ద్వారా ప్రసారమైన ఆయా సబ్జెక్టులను చూపించారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు టి శాట్ ద్వారా పలువురు నిపుణులు ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన వారిచే లైవ్ నిర్వహించడంతో విద్యార్థులు వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పాఠశాలలో చదువుతున్న 129 మంది పదవ తరగతి విద్యార్థులు ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు వీలుగా పాఠశాల ఆవరణలో రెండు టీవీ ప్యానల్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనగిరి నరేందర్‌రావు, ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య, తొంటి శంకర్, కుర్రశేఖర్, కిషన్‌రావు, కిషన్, ప్రసాద్,చందన, జాడి శ్రీనివాస్, ఫరాజ్, దీప్తి, లక్ష్మణ్‌రావు, రవి, శోభారాణి, విజయ్, షఫీలు పాల్గొన్నారు.